అభివృద్ధి పనుల కోసం మరిన్ని నిధులు



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయిస్తామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గాజులరామారం డివిజన్ కై లాష్‌హిల్స్‌లో రూ.29.60 లక్షలతో నూతనంగా నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నిజాంపేట కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలతో పాటు జీహెచ్‌ఎంసీలోని డివిజన్లను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం స్థానిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, జలమండలి డీజీఎం రవి, డివిజన్ అధ్యక్షుడు విజయరామ్ రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కార్పొరేషన్ మేయర్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన సీతారామచంద్ర స్వామి కల్యాణ మండపాన్ని శనివారం డిప్యూటీ మేయర్, ఆలయ కమిటీ చైర్మన్ ధన్‌రాజ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రణయ, మేకల వెంకటేష్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, దివాకర్, సుజాత, కో ఆప్షన్ సభ్యులు వీరేష్, అభిషేక్ రెడ్డి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్‌లు రాజ మోహన్‌రెడ్డి, బైండ్ల నగేశ్, జాయింట్ సెక్రటరీ తలారి సాయి, నాయకులు పాల్గొన్నారు.

భూ పరిరక్షణకు ప్రత్యేక వ్యూహం!

- ప్రభుత్వ, అసైన్డ్ భూములపై ఆరా
- పైలెట్ ప్రాజెక్టు కింద భూసర్వేకు సన్నద్ధం
- అన్యాక్రాంతమైన ప్రభుత్వ, అసైన్డ్ భూముల గుర్తింపునకు రెవెన్యూ శాఖ చర్యలు
- క్షేత్ర స్థాయిలో వీఆర్‌ఓ, వీఏఓలు లేకపోవటంతో తప్పని ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతోంది. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా నిలిచి వాటి అక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే వీఆర్‌ఓ, వీఏఓల వ్యవస్థలను గత ప్రభుత్వం తప్పించిన విషయం విదితమే. ఆ వ్యవస్థలను సంబంధిత శాఖ నుంచి తప్పించి ఇతర శాఖల్లో సర్దుబాటు చేయటంతో భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఓ సవాల్‌గా మారిందనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలోనే భూముల పరిరక్షణకు పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే నిర్వహించి, సాంకేతికంగా కీహోల్ మార్కప్ లాంగ్వేజ్ (కేఎంఎల్) మ్యాప్ (గూగుల్)లో పొందుపరిచేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

మండలాల వారీగా భూముల గుర్తింపు ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను మరోసారి పరిశీలించి, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే భూ పరిరక్షణకు జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిల్లో సర్వే నిర్వహించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. అలాగే ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, విధి విధానాలపై కూడా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందని పేర్కొంటున్న జిల్లా యంత్రాంగం గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీలు, ఫెన్సింగ్ వంటి రక్షణ చర్యల అవశ్యకతపై కూడా దృష్టి సారిస్తోంది.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో...

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది. ఇందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందనే సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది.

- రెవెన్యూ రికార్డుల ప్రకారం బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.
- శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్‌కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది.
- బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.

కోర్టుల్లో వివాద కేసులు ఇలా...

మేడ్చల్ జిల్లాలో భూసంబంధిత కోర్టు కేసులు 706 ఉండగా ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సుప్రీం కోర్టులో ఒకటి కాగా, హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్ కోర్టులో ఆరు కేసులు కొనసాగుతున్నాయి. అలాగే కోర్టు ధిక్కారంలో 35 ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డుల బట్టి తెలుస్తోంది.

అసైన్డ్ భూములెక్కువనే...

జిల్లాలో 2004వ సంవత్సరానికి ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు.

- ఈ అసైన్డ్ భూములన్నీ వ్యవసాయ పంట సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు ఉంది.
- మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. ఇందులో చాలా మేరకు వెంచర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

వివాదంలో చిక్కిన భూములివే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్ కోర్టు పరిధిలో వివాదంలో ఉన్న భూములు 2,485 ఎకరాలు కాగా, రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది.

- ఇతర వివాదాలతోపాటు ఎండోమెంట్, వక్ఫ్, ఫారెస్టు, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ పేర్కొంటున్నది. అసైన్డ్ భూముల కేటాయింపుల్లో భాగంగా 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నాయి.
- జిల్లాలో 5,837 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాల లెక్క తేలగా, మిగతా 6,236 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాలను రెవెన్యూ శాఖ గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.
- జిల్లాలో లెక్క తేలిన 5,837 ఎకరాల భూ వివాదాలకు సంబంధించి మండలాల వారీగా ఇలా ఉన్నాయి. శామీర్‌పేట్ ఉమ్మడి మండలంలో 2,189 ఎకరాల భూములు వివాదంలో ఉండగా, ఇందులో ఫారెస్టుకు సంబంధించి 629 ఎకరాలు, ఎండోమెంట్‌కు సంబంధించి 1560 ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది.
- మేడ్చల్ మండలంలో 1500 ఎకరాలు, ఘట్‌కేసర్
- మండలంలో 1000 ఎకరాలు, కీసర మండంలో 500 ఎకరాలు, మేడిపల్లి మండలంలో 460 ఎకరాలు, కాప్రా మండలంలో 69 ఎకరాలు, దుండిగల్ మండలంలో 70, ఉప్పల్ మండలంలో 50 ఎకరాల భూములు వివాదంలో ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రాపర్టీ షోలో శ్రీలీల సందడి



సినీ నటి శ్రీలీలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతినిధులు..

కుత్బుల్లాపూర్: భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) ప్రాపర్టీ షోలో ప్రముఖ సినీనటి శ్రీలీల సందడి చేశారు. కొంపల్లిలోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో రెండో రోజైన శనివారం స్థిరాస్తి ప్రదర్శన కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలోని ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రాపర్టీలు ఒకే వేదిక మీదుగా సందర్శకులకు అందించడం అభినందనీయమని కొనియాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో సొంతిల్లు కొనుక్కోవాలని ప్రతీ ఒక్కరి కల అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్ రెడ్డి, ప్రెసిడెంట్–ఎలెక్ట్ ఎన్ జైదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేటితో ఈ ప్రాపర్టీ షో ముగియనుంది. క్రెడాయ్ మూడో ప్రాపర్టీ షో ఈనెల 23–25న నాగోల్‌లోని మెట్రో స్టేషన్ సమీపంలో ఉంటుంది.

బస్సు డ్రైవర్లు బాధ్యతగా నడపాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

కుత్బుల్లాపూర్: విద్యార్థులను ఇళ్లకు చేర్చాల్సిన బాధ్యత బస్ డ్రైవర్లపై ఉందని ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి అన్నారు. కొంపల్లిలోని సాధువాస్వాని ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం అల్వాల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సెల్ ఫోన్ డ్రైవింగ్, మితిమీరిన వేగంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ నడపాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం



జగద్గిరిగుట్ట: చింతల్ శ్రీ సాయి కాలనీలోని శ్రీ అభయాంజనేయ, పోచమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నప్రసాద కార్యక్రమానికి అనేక మంది భక్తులు విరాళాలు ఇస్తూ ప్రోత్సహించడం వల్లనే ప్రతి శనివారం కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ చైర్మన్ తెలిపారు.

13న మందకృష్ణకు ఘన స్వాగతం పలకాలి



సమావేశంలో పాల్గొన్న ఎంఆర్పీఎస్ నేతలు

కుత్బుల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ సాధించడంలో అలుపెరుగని పోరాటం చేసిన మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలకాలని ఎంఆర్పీఎస్ నేతలు కోరారు. శనివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఢిల్లీ నుంచి 13వ తేదీన నగరానికి మందకృష్ణ రానున్నారని తెలిపారు. మాదిగ ఉపకులాలు వేలాది సంఖ్యలో హాజరై అభినందనలు తెలపాలన్నారు. అదే విధంగా సాధించుకున్న వర్గీకరణను కాపాడుకోవాలంటే.. వర్గీకరణ వ్యతిరేకులకు ఒక గుణపాఠంగా ర్యాలీ ఉండాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి చిన్న వెంకటేష్, అధికార ప్రతినిధి సిలివేరు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు రసమల్ల యాదగిరి, బూరు రవి, ఎంఎస్‌ఎఫ్ డప్పు రామస్వామి, తిరుపతి, యక్కన్న, కృష్ణ, అబ్రహం, సలోమి, పద్మ, అరుణ, శ్రావణి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డీ యోగా విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో శిక్షకులు

కుత్బుల్లాపూర్: జిల్లా స్థాయి యోగా పోటీల్లో షాపూర్‌నగర్‌కు చెందిన ఎస్ఎస్‌డీ యోగా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నగరంలోని రసూల్‌పురాలోని స్వామినారాయణ ఆలయంలో ఈ నెల 9న యోగాసన భారత్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఇందులో ఎస్ఎస్‌డీ యోగా అకాడమీకి చెందిన పూజిత రెండు బంగారు పతకాలు, ఒక బ్రౌంజ్, దివ్య ఒక బంగారు పతకం, సానవి, అక్షర, దర్శన్‌లు రజత పతకం, మేఘనా బ్రౌంజ్ పతకాలను కైవసం చేసుకున్నారు. విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేస్తున్నట్లు యోగా శిక్షకులు పూర్ణ, విజయ్ తెలిపారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

ఆల్విన్‌కాలనీ: టెక్ మహీంద్రా ఫౌండేషన్, నియోకర్సర్ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో నిరుద్యోగ యువతకు 3 నెలల ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని సంస్థ నిర్వాహకులు శనివారం తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంతి నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లోని సంస్థ చిరునామాలో శిక్షణ ఉంటుందన్నారు. బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్, ఇన్స్యూ ఎంఎస్ ఆఫీస్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తై 18 నుంచి 28 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే వివేకానంద్



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుంనగర్‌లోని శ్రీ సాయి విద్యా నికేతన్ హైస్కూల్‌లో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ శిబిరాన్ని ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ రాజేంద్రప్రసాద్, లయన్ ఎస్.ఎన్ రెడ్డి, వినోద్ జాదవ్, రామ్‌కుమార్ దేవత, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పాఠశాల కరస్పాంటెండెంట్ బిర్రు ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శోభారాణి, వైద్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 45 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. రూ.18.42 లక్షల విలువ గల చెక్కులను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మాయ బాల నరసింహ, సంపత్‌రెడ్డి, శ్రీకాంత్, మోహన్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేక.. పరికరాలు మాయం

- లక్షలు వెచ్చించి ఓపెన్‌జిమ్ పరికరాల ఏర్పాటు
- 2 నెలలుగా ఒక్కో పరికరం మాయం
- పట్టించుకోని అధికారులు



మాయమైన పరికరాలు(ఇన్‌సెట్‌లో)



వ్యాయామం చేసే వాటిపై చిన్నపిల్లలు ఏర్పాటు చేసిన గూడారం

జగద్గిరిగుట్ట: లక్షలు వెచ్చించి పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు మాయమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లేనని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సంవత్సరం క్రితం జంట సర్కిల్‌ల్లో (కుత్బుల్లాపూర్, గాజులరామారం) ప్రతీ డివిజన్‌కు ఒకటి చొప్పున ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. దీనికి ఒక్కో ఓపెన్ జిమ్‌కు రూ.11 లక్షలు వెచ్చించారు. వాటి నిర్వహణ మాత్రం అంతంత మాత్రమే. దీంతో ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు మాయమవుతున్నాయి. డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహ కల్పలో 1వ బ్లాక్‌లోని పార్క్‌లో ఏర్పాటు చేసిన జిమ్‌లో 2 నెలలుగా ఒక్కో పరికరం మాయమమవుతున్నాయి. కాగా ఈ ఓపెన్ జిమ్‌కు మొదటి 6 నెలలు స్థానికులు ఆసక్తి చూపారు. ఆ తర్వాత ఇక్కడ వ్యాయామం చేయడం తగ్గిపోవడంతో రాత్రివేళల్లో జిమ్ పరికరాలను ఎత్తుకెళ్తున్నారు. ఇంకా వ్యాయామం చేసే పరికరాలను చిన్నపిల్లలు వారికి తోచిన విధంగా వాడుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓపెన్ జిమ్ పరికరాలపై దృష్టి సారించాలని కోతున్నారు.

4.47 కిలోల గంజాయి స్వాధీనం

కుత్బుల్లాపూర్: మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 4.47 కిలోల గంజాయి, 750 గ్రాముల గంజాయి చాక్లెట్లు పట్టుబడ్డాయి. ఎక్సైజ్ సీఐ యాదయ్య వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ గంపల బస్తీలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు ఎస్ఐలు రామకృష్ణ, రవి, సిబ్బంది సీతారాం, ప్రవీణ్‌తో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. బిహార్‌కు చెందిన అభయ్‌గిరి(27) అనే వ్యక్తి నుంచి 4.47 డ్రై గంజాయి, 750 గ్రాముల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. బిహార్ నుంచి గంజాయిని తీసుకువచ్చినట్లు నిందితుడు అంగీకరించాడు. ఈ మేరకు కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురు అధికారుల బదిలీ

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ముగ్గురు అధికారులను బదిలీ చేస్తూ శనివారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాయిని కాప్రా మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో బాచుపల్లి మండల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మంజుల బదిలీపై రానున్నారు. స్థానికంగా పేట్‌బషీరాబాద్ సెక్టర్ ఆర్‌ఐగా పనిచేస్తున్న రేణుక బాచుపల్లికి బదిలీ కాగా.. ఆమె స్థానంలో మేడిపల్లిలో పనిచేస్తున్న గులాం ఖలీం రానున్నారు. జగద్గిరిగుట్ట, గాజులరామారం సెక్టర్‌లో పనిచేస్తున్న ఆర్‌ఐ రజినీకాంత్ మూడుచింతలపల్లికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఘట్‌కేసర్‌లో పనిచేస్తున్న విజయ్ కుమార్ ఇక్కడికి రానున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

మూసాపేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పంచశీల పాఠశాల కరస్పాంటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థి నాయకుల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించి అవగాహన కల్పించారు. 8 మంది పోటీలో నిలిచారు. సాధారణ ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో అలాగే ప్రచారానికి సమయం కేటాయించి, గుర్తులు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చెత్తను తొలగించరూ..



రింగ్ బస్తీలో మధ్యాహ్నం 12 గంటలకు కుప్పలుగా ఉన్న చెత్త

జగద్గిరిగుట్ట: చెత్తను ఇంటికి వచ్చే ఆటోలోనే వేయాలని ఎన్ని ఆంక్షలు పెట్టినా, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన మార్పు మాత్రం రావడం లేదు. జీవీపీలు (గార్బేజ్ వర్నరబుల్ పాయింట్స్) ఎత్తివేశామని చెప్పినా చెత్తను మాత్రం అదే స్థలంలో వేస్తున్నారు. చెత్తను వేసిన గంటలోనే శానిటేషన్ సిబ్బంది శుభ్రం చేయాలని షరుతులు కూడా ఉన్నాయి. కానీ సిబ్బంది మాత్రం ఇవేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ఇప్పటికే ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చింతల్: జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఆసుపత్రి, ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో 200 మంది పాల్గొన్నారు. వైద్యులు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ సంస్థ సభ్యులు మహిళలకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, అనీమియా లక్షణాలు ఉన్న వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిత్య కోడి, సభ్యులు వెంకటనారాయణ, మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్ నర్సింగ్‌రావు, కోడి ఆదిత్య, సాయి ప్రకాష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డిప్యూటీ మేయర్ జన్మదిన వేడుకలు



డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నిజాంపేట్‌లోని ఆయన నివాసంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై ఆయనతో కేక్ కట్ చేయించారు. మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

కూకట్‌పల్లి: ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు సార్లు ప్రజల మద్దతుతో భారీ మెజారిటీతో గెలుపొందిన తాను ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంటే కొందరు అధికారులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తూ పనులు చేయకుండా పబ్బం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతుంటే ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే స్పీకర్ సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి శాసనసభ్యుడి హక్కులకు భంగం కలిగించే అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.